నేడు 'ప్రజావాణి'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం అక్కడికక్కడే తగు చర్యలు తీసుకుంటారని వారు వివరించారు.

కారులో మంటలు

కాలిపోయిన కారు: తప్పించుకున్న డ్రైవర్



శంషాబాద్ రూరల్: రహదారిపై వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని కారు దగ్ధమైంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... నగరం నుంచి టాటా జెస్ట్ కారు ఆదివారం మధ్యాహ్నం షాద్‌నగర్ వైపు వెళ్తుంది. బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి శివారులో ఉన్న రైల్వే వంతెనపైకి రాగానే కారులో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ హుస్సేన్ వెంటనే కారును నిలిపివేసి కిందకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పాటు ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మంటలకు కారు ఆహుతైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

జూన్ 2 నుంచి 'సమ్మర్ స్టూడెంట్ ప్రేనార్'

గోల్కొండ: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు వారిలోని నూతన ఆలోచన విధాన్ని పెంపొందించడానికి తాము 'సమ్మర్ స్టూడెంట్ ప్రేనార్'కార్యక్రమం నిర్వహిస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. అటల్ ఇక్యూబేషన్ సెంటర్, జీఎన్ఐటీఎస్ నీతి ఆయోగ్‌తో కలిసి 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు కళాశాల ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్ఈపీ–2020 ఆధారంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధన అవశ్యాకత సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులపై అవగాహన తదితర విషయాలపై ఈ హ్యాండ్ ఆన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 9207081188లో సంప్రదించాలని ఆయన కోరారు.

బాక్సింగ్‌లో శిక్షణ



గోల్కొండ: బల్దియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలలో జోష్ నెలకొంది. షేక్‌పేట్‌లో జరుగుతున్న వేసవి బాక్సింగ్ క్యాంప్‌లో టీనేజర్స్ ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ నేర్చుకుంటున్నారు. పంచ్‌లు విసురుతూ ప్రత్యర్థులను పడగొడుతూ కోచ్ నుంచి కొత్త కొత్త పంచ్‌లు ఎలా విసరాలో నేర్చుకుంటున్నారు. ఇక్కడ బాక్సింగ్‌లో శిక్షణ పొందిన వారు గతంలో రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించారని బాక్సింగ్ కోచ్ బి.శివ కుమార్ వెల్లడించారు.

షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కృషి చేస్తున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, మణికొండ రోడ్డు, జై హింద్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటి వరకు ఎంపీ లక్షలాది రూపాయలు కేటాయించారని, అంబేడ్కర్‌లోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఆయన నిధులు కేటాయించారన్నారు. లక్ష్మీగణపతి శివాలయం ఆలయ కమిటీ చైర్మన్ సి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శులు హరి, రవి తదితరులున్నారు.



వ్యర్థాలతో నిండిన ధర్మోజి కుంట



హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగించమని చెప్పిన ధర్మోజి కుంట బఫర్ జోన్‌లో ఉన్న ప్రహరీ

డంపింగ్ యార్డుగా ధర్మోజికుంట

- విచ్చలవిడిగా వ్యర్థాల పారబోత
- బఫర్‌జోన్‌లో తొలగించని ప్రహరీ

శంషాబాద్: పట్టణంలోని ధర్మోజి కుంట డంపింగ్ యార్డులా మారిపోయింది. విచ్చలవిడిగా వ్యర్థాలు పారబోస్తుండటంతో కుంట ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడుతోంది. ధర్మోజి కుంట రక్షించడంతో ఇరిగేషన్ అధికారుల వైఫల్యంతో పాటు దానిని పరిసరాలను అభివృద్ధి చేయడంతో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కాస్తా భవిష్యత్తులో మ్యాపులకే పరిమితమై పోయేలా ఉంది.

ఉనికి కోల్పోయేలా...

పట్టణంలోని సర్వే నంబరు 73లో ధర్మోజి కుంట 10 ఎకరాల 12 గుంటల్లో విస్తరించి ఉంది. గొలుసుకట్టు చెరువుగా ఉన్న ఈ చెరువు గతంలో సమీపంలోని వ్యవసాయ పొలాకు జీవనాధారంగా ఉండేది. సమీపంలో కాలనీలో వెలియడంతో పాటు పై నుంచి వచ్చే నీటి వనరులకు సంబంధించిన ప్రైవేటు స్థలాల్లో కూడా భారీ భవంతులు నిర్మితమయ్యాయి. ప్రస్తుతం చెరువుకు సంబంధించిన స్థలం మాత్రమే మిగిలింది. దీనిని కూడా ఆక్రమించుకునే ఆలోచనల్లో కొన్ని నెలలుగా పెద్ద ఎత్తున డంపింగ్ వ్యర్థాలు ధర్మోజి కుంటలో పారబోస్తున్నారు. దీంతో కుంట సింహభాగం డంపింగ్ వ్యర్థాలతో నిండిపోయింది. చనిపోయిన జంతు కళేబరాలు, పందులకు ఆవాసంగా మారింది

కమిషనర్ హెచ్చరించినా...

ధర్మోజి కుంట ఎగువభాగంలో ఓ రాజకీయ పలుకుబడి గలిగిన వ్యక్తి భారీ ఎత్తున ప్రహరీని నిర్మించాడు. బఫర్ జోన్‌లోనే ప్రహరీ ఉన్న సంగతి సాక్షాత్తు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి ఇరిగేషన్ అధికారిని హెచ్చరించారు. వెంటనే బఫర్‌జోన్‌లో ఉన్న ప్రహరీని తొలగించాలని సూచించారు. అయినా నేటికీ ప్రహరీ అలాగే ఉంది. హైడ్రా కమిషనర్ ఆదేశించినా బఫర్ జోన్‌లో ఉన్న ప్రహరీ తొలగించకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిరక్షణకు ఇరిగేషన్ శాఖ పట్టించుకోకపోవడంతో పాటు చెరువు అభివృద్ధి స్థానిక సంస్థలు కూడా జోక్యం చేసుకోకపోవడంతో ధర్మోజి కుంట పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి కబ్జారాయుళ్ల చేతుల్లోకి పోతుందేమోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

చెస్ పోటీల్లో సత్తాచాటుతున్న శివాంశిక



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసలు అందుకుంటున్న శివాంశిక (ఫైల్)



తల్లి భవానీతో...

అత్తాపూర్: చదరంగంలో గ్రాండ్ మాస్టర్‌గా తన కూతురు శివాంషికను చూడాలనే ఏకైక లక్ష్యం.. సంకల్పం దృఢ విశ్వాసంతో ఓ తల్లిగా కృషి చేస్తున్నట్లు శివాంశిక తల్లి జి.భవాని తెలిపారు. మదర్స్ డే సందర్భంగా ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. మహబుబాబాద్ జిల్లా వేములపల్లి గ్రామానికి చెందిన నిరుపేద గౌడ కుటుంబానికి చెందిన సతీష్, భవానీల కూతురు జి.శివాంశిక 5వ తరగతి వరకు తండ్రి సతీష్ పోస్టు గ్రాడ్యుయేట్ చేసి స్థానికంగా 108 వాహనలో ఎమర్జెన్సీ టెక్నీషియన్‌గా పని చేస్తుంటాడు. తల్లి భవాని కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంపీఈడీ మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. మహబూబాబాద్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి వరకు శివాంషిక చదువుకుంది. చెస్ క్రీడారంగంలో ఆసక్తి కనబరిచిన తన కూతురును శిక్షణ ఇప్పించేందుకుగాను అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ తీసుకొని స్థానికంగా ఉన్న మెస్ట్రో చెస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటుంది. ఒకవైపు చదువు మరో వైపు చెస్‌లో రాణిస్తూ దేశంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న టోర్నమెంట్‌లో పాల్గొంటూ తన ప్రతిభకు పదును పెడుతూ చెస్ క్రీడాకారులు గ్రాండ్ మాస్టర్ ప్రశంసాలు అందుకున్నది. కూతురు శివాంశిక కోసం చెన్నై నగరంలో శిక్షణ ఇప్పిస్తూ స్థానిక విశ్వవిద్యాలయంలో సైకాలజీ విద్యను అభ్యసిస్తున్నది. భువనేశ్వర్ ఉన్న కిట్ యూనివర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ చెస్ పోటీల్లో ఆడుతుంది. ఈ నెల 16 వరకు జరిగే ఈ చెస్ క్రీడల్లో శివాంశిక ఆడుతుందని తల్లి భవాని 'సాక్షి'కి వివరించారు.



చెస్ పోటీల్లో పాల్గొంటున్న శివాంశిక

కురుమ సంఘం నూతన కార్యవర్గం



మణికొండ: గండిపేట మండలం కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మణికొండలోని శ్రీ బీరప్ప మల్లన్న స్వామి ఆలయం భవనంలో మణికొండ కురుమ సంఘం చైర్మన్ బి.జైసింద్‌రావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని చైర్మన్ వెల్లడించారు. అధ్యక్షుడిగా డి.భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రమేష కోశాధికారిగా రత్నాకర్, కార్యదర్శిగా హరికృష్ణలను ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు ఇ.యాదయ్య, పి.మల్లేష్, బి.శ్రీరాములు, బి.ముత్యాలు, డి.రాజు, సి.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరులైన వీర జవాన్లకు ఘన నివాళి



మూరళీనాయక్, సచిన్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

చార్మినార్: సైనికుల సాహసంతోనే భారతదేశం ఎంతో పటిష్టంగా, సురక్షితంగా ఉందని ఓల్డ్‌సిటీ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం లాల్దర్వాజాలోని పూల్ బాగ్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్ లో ఓల్డ్ సిటీ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరవీరులైన మురళి నాయక్, సచిన్ యాదవులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ దాడులు దేశం గర్వపడేలా ఉన్నాయన్నారు. దేశభద్రత, ఆత్మగౌరవం, నైతిక విలువలు కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రతి భారతీయుడు సైనికులకు అండగా నిలవాలన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఓల్డ్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ ఒక సందేశాన్ని పంపారని అధ్యక్షులు తెలిపారు. ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ టి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సా ర్వభౌమాధికారాన్ని కాపాడడంలో సైనికుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్య సమాజ్ ప్రచార కార్యదర్శి యోగా గురువు శ్రీ ఎస్. రామకృష్ణశాస్త్రి, కే. రఘు, బి శేఖర్, ఎం కిరణ్ చారి, ఎస్ సురేందర్, బి ఆంజనేయులు చారి, ఎం శశిధర్ చారి, బి వెంకటేష్, హెచ్ హనుమంత్ రెడ్డి, ఈ గిరీష్ బాబు,శ్రీనివాస్ చారి విజయ్ కుమార్, రాజ ప్రభు, బాక్సింగ్ కోచ్ ప్రతాప్ ప్రదీప్ పాల్గొన్నారు.

కరాచీ బేకరీపై దాడి

బీజేపీ, బీజేవైఎం నేతలపై కేసు నమోదు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని కరాచీ బేకరీపై శనివారం దాడి చేసిన బీజేపీ నేతలపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... పట్టణంలోని సంగీత మొబైల్స్ పక్కనే ఉన్న కరాచీ బేకరీ పేరును మార్చాలంటూ బీజేవైఎం, బీజేపీ నాయకులు శనివారం బేకరీ ముందు ఆందోళన చేపట్టారు. దాయాది దేశంతో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్‌లోని కరాచీ పేరున్న దుకాణాలు మన దేశంలో కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరాచీ బేకరీ పేరును వెంటనే మార్చాలంటూ ఆందోళన చేయడంతోపాటు పేరుతో ఉన్న బోర్డును మార్చేందుకు యత్నించారు. దీనిపై బేకరీ యజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్బందులకు గురిచేసిన పది మంది బీజేపీ నేతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ వాహనం ఢీకొట్టిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఈ నెల 9వ తేదీన ఉదయం 7 గటల ప్రాంతంలో టీఆర్‌జీ ఆసుపత్రి ముందు ఒక వ్యక్తి రోడ్డు దాటుతుండగా చంద్రాయణగుట్ట నుంచి దుర్గానగర్ వైపు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనం నెంబర్ టిజి12టి2204ను డ్రైవర్ సయ్యద్ సోహెబ్ అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా అతివేతంగా తన బండి నడిపి గుర్తు తెలియని వ్యక్తిని ఢీకోట్టాడు. దీంతో తలకు బలమైన రక్త గాయాలు కాగా డ్రైవర్ చికిత్స నిమ్మితం ఉస్మానియా ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడన్నారు. గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడన్నారు. మరణించిన వ్యక్తి వయస్సు 30–35 సంవత్సరాలు ఉంటుందని ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా ఆయన సంబంధీకులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఫోన్స్: 87125 68230, 94906 17459లలో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



బి.రాజు

అత్తాపూర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నారాయణఖేడ్ జిల్లా చిత్తాపూర్ గ్రామానికి చెందిన బి.రాజు(45) భార్యతో కలిసి అత్తాపూర్ భరత్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత సంవత్సరం మే 24న గ్రామానికి వెళ్లి తిరిగి వచ్చిన రాజు కొన్ని రోజులు భరత్‌నగర్‌లోనే ఉన్నాడు. అతని భార్య గోవిందమ్మ పనులు నిమిత్తం చిత్తాపూర్‌లోనే ఉంటుంది. రాజు హైదరాబాద్‌లోనే ఉండి ఉండవచ్చునని వేరే మహిళతో కాపురం పెట్టి ఉండవచ్చునని భార్య గోవిందమ్మ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



రామారావును సన్మానిస్తున్న కుమ్మరి సంఘం సభ్యులు

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ శ్రమశక్తి అవార్డు గ్రహీత రామారావును తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని కుమ్మరి సొసైటీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ తన సేవలను గుర్తించి శ్రమశక్తి అవార్డు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యలను నిరంతరం పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షుడు నుదునూరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి కొల్లూరు అనిల్, గోల్కొండ ఉత్సవ కమిటీ చైర్మన్ కాకులారం శంకర్, యాదయ్య, శ్రీరాములు, మహేష్, శ్రీకాంత్, అప్పారెడ్డి ముఖేష్, కృష్ణ, రామకృష్ణ, అనిల్, సజ్జన్, వినోద్ పాల్గొన్నారు.



జయప్రదాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా మాతృదినోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భావన రుషి కాలనీలో మాతృదినోత్సవాన్ని నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ మార్కండేయ పద్మశాలీ ట్రస్ట్ భవనంలో జరిగింది. క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అధ్యక్షత వహించగా కార్యక్రమాన్ని సాంస్కృతిక కార్యదర్శి గొంత్యాల శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీ తిరుపతమ్మ, ఆశావర్కర్ లక్ష్మీ తల్లులకు పాదపూజ చేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సేవా భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జయప్రదాదేవి మాట్లాడుతూ... తల్లి ప్రేమకు ప్రత్యామ్నాయం లేదన్నారు. తల్లి త్యాగాలు, సేవలు మన జీవితానికి వెలకట్టలేని వరం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ మాట్లాడుతూ... తల్లి సేవ పుణ్యఫలాలు ఇస్తుందన్నారు. తల్లి ప్రేమ అమూల్యమైనదని అని అన్నారు. మాతృభక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్, హేమలత, వందన, గాయత్రి, కాశీగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్: మాతృ దినోత్సవాన్ని రాజేంద్రనగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులు అంతా కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు.



రాజేంద్రనగర్‌లో...

గుంతలమయమైన సీసీ రోడ్డు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి కాళీమందిర్ వెళ్లే సీసీ రోడ్డు గుంతల మయంగా మారింది. దీన్ని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో మంచి నీటి పైప్‌లైన్ల కోసం సీసీ రోడ్డును తవ్వి మరమ్మతులు అంతంత మాత్రంగానే చేశారు. కాలనీలో ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్‌లు, డ్రైనేజీ లైన్లు తీసుకొని రోడ్డును సరిగా పూడ్చి మరమ్మతులు చేయకపోవడంతో అడుగడుగునా గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రమాదాలబారినా పడుతున్నారు. బండ్లగూడ గ్రామం నుంచి వికాస్‌నగర్, షిరిడీ సాయిబాబా కాలనీ, యాదవ మిత్ర కాలనీ, ద్వారకానగర్ మీదుగా కాళీమందిర్ వెళ్లే రోడ్డు వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


వేడుకగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, వేద పండితులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని శ్రీ జ్వాలా యోగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి జయంతి సందర్భంగా ఉదయం పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పొంగుతున్న మురుగు



మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సాయిబాబా కాలనీ ప్రధాన రహదారిపై అండర్ డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సండే..సందడి

గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలో సందడి చేశారు. కుతుబ్‌షాహీ ఫిరంగి వద్ద యువకులు, యువ జంటలు సెల్ఫీలు దిగారు. చరిత్ర ప్రేమికులు కోటలోని ఆయుధగారంలో ఉన్న కుతుబ్‌షాహీ రాజులు వాడిని వివిధ రకాల ఆయుధాలను ఆకస్తిగా తిలకించారు. కాగా నగరంలో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన విదేశీ పర్యాటకులు కోటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

